www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 9 మే 2024 | 8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి

క్రాస్‌ఓటింగ్.. గుబులు..!

నరసాపురం లోక్‌సభ స్థానంలో బిజెపికి ఎదురుదెబ్బేనా?

వైసిపి అభ్యర్థి ఉమాబాలకు కలిసి రానున్న సామాజిక తరగతి బలం

టిడిపి, జనసేన బలంపైనే బిజెపి అభ్యర్థి ఆశలు

ఎంపీ స్థానం గెలుపుపై వైసిపి పూర్తి ధీమా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నరసాపురం లోక్‌సభ స్థానంలో బిజెపికి ఎదురుదెబ్బ తగిలే పరిస్థితి ఏర్పడనుందని రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలైన ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకులో టిడిపి కూటమి బలంగా ఉన్నప్పటికీ లోక్‌సభకు ఓటింగ్ భిన్నంగా కొనసాగే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు. అందుకు ప్రధాన కారణం వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు ఉన్న సామాజిక తరగతి బలమేననే వాదన విన్పిస్తోంది. దీంతో నరసాపురం ఎంపీ స్థానం ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఇక్కడ బిజెపి అభ్యర్థిగా క్షత్రియ సామాజిక తరగతికి చెందిన భూపతిరాజు శ్రీనివాసవర్మ పోటీలో ఉన్నారు. వైసిపి అభ్యర్థిగా శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన గూడూరి ఉమాబాల రంగంలో ఉన్నారు. ఆమె ఆర్థికంగా బలమైన అభ్యర్థి కాకపోయినప్పటికీ ఈ లోక్‌సభ స్థానం పరిధిలో శెట్టిబలిజ సామాజిక తరగతి ఓట్లు పెద్దఎత్తున ఉండటంతో ఆమెకు అవకాశం దక్కిందని చెప్పొచ్చు. గడిచిన ఎన్నికల్లో పొత్తులో భాగంగా బిజెపి నుంచి పోటీ చేసిన క్షత్రియ సామాజిక తరగతికి చెందిన సినీనటుడు కృష్ణంరాజు, గోకరాజు గంగరాజు గెలుపొందారు. అప్పట్లో ప్రధాన పార్టీలు సైతం క్షత్రియ సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులనే బరిలోకి దింపిన పరిస్థితి ఉంది. ఈసారి వైసిపి సరికొత్త వ్యూహానికి తెరలేపింది. శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన బిసి అభ్యర్థిని బరిలోకి దింపి అందరికీ షాక్ ఇచ్చింది. ఆచంట, పాలకొల్లు, భీమవరం, తణుకు వంటి పలు నియోజకవర్గాల్లో శెట్టిబలిజ ఓటర్లు పెద్దసంఖ్యలో ఉన్నారు. వైసిసి సైతం సంస్థాగతంగా బలంగానే ఉంది. గడిచిన ఎన్నికల్లో ఇక్కడ ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు స్థానాలను వైసిపి గెలుచుకోవడంతోపాటు నరసాపురం ఎంపీ స్థానాన్ని సైతం కైవసం చేసుకుంది. దీన్నిబట్టి నరసాపురం లోక్‌సభ స్థానంలో వైసిపి బలం గురించి వేరే చెప్పనక్కర్లేదు. దీంతో ఇక్కడ గెలుపోటములపై ప్రధానంగా చర్చ నడుస్తోంది. అసెంబ్లీ స్థానంలో

ఉమాబాల

శ్రీనివాసవర్మ

నచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు వేసుకున్నా, ఎంపీ ఓటు మాత్రం గూడూరి ఉమాబాలకు వేయాలని శెట్టిబలిజ సామాజిక తరగతిలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. దీంతో లోక్‌సభకు క్రాస్ ఓటింగ్ జరిగే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. క్రాస్‌ఓటింగ్ జరిగితే బిజెపి లోక్‌సభ అభ్యర్థికి ఎదురుదెబ్బ ఖాయమనే అంచనాలు నెలకొన్నాయి. మోడీ సర్కార్‌పై పలు తరగతుల్లో తీవ్రమైన ఆగ్రహం ఉంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను మోడీ ప్రభుత్వం విపరీతంగా పెంచేసింది. యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసింది. ఉపాధి హామీ పనుల్లో సవాలక్ష నిబంధనలు తెచ్చి కూలీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మతవిద్వేషాలను రెచ్చగొడుతూ జనాల మధ్య విభజన రేఖలు గీస్తోంది. కేంద్రంలోని బిజెపి తన పదేళ్ల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. దీంతో బిజెపికి వ్యతిరేకంగా ఓటువేయాలని చాలా తరగతులకు చెందిన ప్రజానీకం గట్టిగా భావిస్తున్నారు. దీనికితోడు శెట్టిబలిజ ఓటర్లు క్రాస్‌ఓటింగ్ చేస్తే బిజెపి అభ్యర్థి శ్రీనివాస వర్మకు ఓటమి ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వైసిపి నాయకులు శెట్టిబలిజ సంఘాలతో మాట్లాడి ఆ సామాజిక తరగతి ఓట్లు ఉమాబాలకు పడేలా వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. అదే క్రమంలో ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా కెబిఆర్.నాయుడు పోటీలో ఉన్నారు. ..6లో

10న గూడెంలో సిఎం జగన్ సభ

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 10వ తేదీ శుక్రవారం సిఎం జగన్ తాడేపల్లిగూడెం రానున్నారని, మేమంతా సిద్ధం సభలో పాల్గొంటారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వైసిపి ఎంఎలఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ముఖ్య మంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిగూడెం విచ్చేసి ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారన్నారు. స్థానిక పోలీస్ ఐలాండ్ సెంటర్‌కు సమీపంలోని బ్రహ్మానందరెడ్డి మార్కెట్ సెంటర్లో ఈ సభ జరుగుతుందన్నారు. సభకు వచ్చే వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం సిఎం పర్యటనకు సంబంధించి సభాస్థలి, పార్కింగ్ తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎపి స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

10న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు రాక

- భీమవరంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- ఇండియా వేదికలోని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కేంద్రమైన భీమవరంలో ఈ నెల 10న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పర్యటించనున్నట్లు ఆ పార్టీ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇండియా వేదికలో భాగస్వాములైన కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ భీమవరం ప్రకాశంచౌక్‌లో సాయంత్రం ఐదు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ నర్సాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు, ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను సిపిఎం తరపున బలపరుస్తున్నామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 10న సాయంత్రం నాలుగు గంటలకు భీమవరం కొత్త బస్టాండ్ నుండి భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రకాశం చౌక్‌లో సాయంత్రం ఐదు గంటలకు గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభలో ప్రధాన వక్తగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కాంగ్రెస్ నర్సాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు, కాంగ్రెస్ సీనియర్ నేత కనుమూరి బాపిరాజు, సిపిఎం, సిపిఐ ముఖ్య నేతలు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ బహిరంగ సభకు ప్రజానీకం పెద్దఎత్తున తరలొచ్చి మద్దతు తెలపాలని కోరారు. సిపిఎం ..6లో

శివయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎపి కౌలురైతుల సంఘం

ప్రజాశక్తి - ఆచంట

శివయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నేతలు

అకాల వర్షంతో ఆందోళనకు గురై పంట కళ్లాల్లో ధాన్యం బస్తాల వద్ద గుండెపోటుకు గురై మృతి చెందిన కౌలురైతు కంకిపాటి శివయ్య (56) కుటుంబానికి రూ.ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శివయ్య మృతదేహాన్ని సంఘం నేతలు బుధవారం సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఆచంట పెదపేటకు చెందిన కౌలురైతు కంకిపాటి శివయ్య సొంత వ్యవసాయం 70 సెంట్లతోపాటు మరో ఎకరంన్నర కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడన్నారు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన భారీ ఈదురుగాలులు, వర్షానికి ధాన్యం బస్తాలపై బరకాలు కప్పేందుకు వెళ్లి ఆందోళనతో గుండెపోటుకు గురై బస్తాల వద్దే మృతి చెందడం బాధాకరమన్నారు. శివయ్య కుటుంబానికి రూ.5 లక్షలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగరాజు, తహశీల్దార్‌తో మాట్లాడామన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆయన పేరున కౌలు గుర్తింపు ..6లో

ఆ గ్రామాలకు వెళ్లాలంటే.. పడవే గతి

మధ్యపేజీల్లో..

ఆత్మగౌరవం కోసమే పోటీ

ఎలిజా

సిపిఐ అభ్యర్థి బండిని గెలిపించండి

8లో..

తుదిదశకు పోలింగ్ ఏర్పాట్లు

ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ తుది దశకు చేరుకున్నాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత, ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించారు. దీనిలో జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, సాధారణ వ్యయ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్‌పాఠక్, ఎస్ఎ.రామన్, పోలీస్ అబ్జర్వర్ టి.శ్రీధర్ పాల్గొన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 1,744 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 13న నిర్వహించే పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఇవిఎంల కమిషనింగ్‌కు సంబంధించి తాజాస్థితి వివరించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ కూడా దాదాపు పూర్తయ్యిందన్నారు. ఎన్నికల పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాట్లు వివరించారు. పోలీస్ బందోబస్తు, శాంతిభద్రతల వివరాలను జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి వివరించారు.

45వ డివిజన్‌లో తాగునీటి కష్టాలు

పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

ఏలూరు సిటీ:ఏలూరు గన్ బజార్, ఆదివార పేట ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంద కుటుంబాలు ఉన్న డివిజన్‌లో నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీటి ఇబ్బందులు తట్టుకోలేక సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్లు వద్ద మహిళలు బారులు తీరు తున్నారు. ఇలా ఎంతకాలం తాగునీటి కోసం తంటాలు పడాలంటూ స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. తాగు నీటి సమస్య పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యపై నామమాత్రంగా నీటి సరఫరా చేస్తున్నారని, నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారి తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

అకాల వర్షానికి రహదారి ఛిద్రం

బురదమయమైన రహదారి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి రహదారి బురదమయమైంది. వేసవి కావడంతో నిన్నటి దాక వేడితో మగ్గిన ప్రజలు.. వర్షం కురవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కాని ఇటు రహదారి మాత్రం చిద్రంగా మారింది. రోడ్డు మీద మట్టిగడ్డలు పడి చిద్రంగా మారడంతో వాహనదారుల బండి జారి పడిపోతున్నారు. ఒక్క వర్షానికే ఇలా ఉంటే, ఇంక వర్షాకాలం వస్తే ఏంటి పరిస్థితని ప్రజలు లబోధిబోమంటున్నారు. గ్రీన్ ఫీల్డ్‌కు సంబంధించిన లారీలు మట్టి తరలించడానికి నిత్యం ఇదే మార్గం ఉపయోగిస్తున్నారు. అధిక స్పీడ్‌తో వెళ్లడంతో దుమ్ముతో పాటు మట్టి గడ్డలు రోడ్ మీద పడి తడి అవ్వడంతో రోడ్డు జిగురుగా మారుతుంది. నిత్యం స్థానికులు ఇదే రోడ్‌పై తిరుగుతారు. కొన్నిసార్లు జారి పడిపోతున్నారు. మరి ఈ మార్గం అవగాహన లేని వారి పరిస్థితి ఏమిటిని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు? నిత్యం అనేకసార్లు వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ అధికారులకు మట్టితరలించే వాహనాల స్పీడ్ తగ్గించి, మట్టిగడ్డలు రోడ్డు మీద పడకుండా చూడాలని ఎన్నిసార్లు చెప్పినా వారు పట్టించుకోవట్లేదు. దీంతో పట్టించుకోండి మొర్రో అని అధికారులను వేడుకున్నా వారు స్పందించని పరిస్థితి. గ్రీన్‌ఫీల్డ్ అధికారులు మాత్రం ఏమీ చేసుకుంటారో చేసుకోండి.. మా వెనకాల అధికార యంత్రాంగం ఉంది అన్నట్లు వారి తీరు విమర్శలకు దారితీస్తుంది. సామాన్యులు ఎవరైనా ఇలా చేస్తున్నారేంటని వారిని ప్రశ్నిస్తుంటే, అధికారుల చేత ఫోన్లు చేయించి బెదిరిస్తున్నారు. అసలు మా సమస్యను ఎవరు పరిష్కరిస్తారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుంగిపోయిన లాంగ్ జంప్ నిర్మాణం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కృంగిపోయిన గోడ

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులకు క్రీడా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రధానమంత్రి స్కీమ్ నుంచి రూ.లక్ష నిధులను కేటాయించారు. ఈ నిధులతో షటిల్ కోర్ట్, లాంగ్ జంప్ దూకేందుకు ట్రాక్ నిర్మాణ పనులను చేపట్టేందుకు స్కూల్ యాజమాన్యం కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. అయితే లాంగ్ జంప్ దూకేందుకు నిర్మాణ పనులను సగం పూర్తి చేసి వదిలేశారు. అది కాస్తా మంగళవారం కురిసిన వర్షానికి నిర్మాణ గోడ కృంగిపోయి లోపల నీటితో నిండి పోయింది. దీనిపై ప్రధానోపాధ్యాయులు టి.చంద్రావతిని వివరణ అడగగా నిర్మాణం చేపట్టి, మధ్యలో మట్టి పోయకపోవడం వల్ల అలా గోడ నిర్మాణం కూలిపోయి వుంటుందని అన్నారు. వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిచి గోడ నిర్మాణాన్ని చూపించి, నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేసి, చుట్టూత మట్టిని నింపాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

'విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తాం'

ప్రజాశక్తి - కామవరపుకోట

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వబ్రాహ్మణులకు తగిన గుర్తింపుతో పాటు వారి సమస్యలను పరిష్కరిస్తామని చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ తెలిపారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామపంచాయతీలోని విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులతో ఆయన బుధవారం సమావేశం అయ్యారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గూడపాటి కేశవరావు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో వైసిపి ఇంటింటా ప్రచారం

టి.నరసాపురం:మండలంలోని కృష్ణాపురంలో వైసిపి కార్యకర్తలు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిలను గెలిపించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో వివరించారు. ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ధరావతు రమేష్ నాయక్, ముఖ్య రాజనాయక్ పాల్గొన్నారు.

'ఎన్‌డియే అభ్యర్థులను గెలిపించాలి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్‌డియే కూటమి అభ్యర్థులను గెలిపించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఎన్‌డియే కూటమి సూపర్ 6 మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డియే కూటమి అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు మూడు వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

బిఎల్‌ఒలు అప్రమత్తంగా ఉండాలి

ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి

ముసునూరు:ఎన్నికల డ్యూటీ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బిఎల్‌ఒలు, వైద్య ఆరోగ్య, పోలీస్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముసునూరు మండల ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, ముసునూరు ఎస్ఐ పి.వాసు పేర్కొన్నారు. బుధవారం ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన జరగనున్న ఎంపీ, ఎంఎల్ఎ ఎన్నికల నియమావళినుద్దేశించి ఎన్నికల సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

రామకోటయ్య ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - చాట్రాయి

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని చిన్నం రామకోటయ్య అన్నారు. చాట్రాయిలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని మాజీ ఎంఎల్ఎ, వైసిపి నాయకులు చిన్నం రామకోటయ్య బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టిడిపి నాయకులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని, సంక్షేమ పథకాలన్నీ అమలు జరగాలంటే జగన్మోహన్ రెడ్డి వల్లే సాధ్యమని అన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని వైసిపి అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు దామెర ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థుల ప్రచార ర్యాలీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో టిడిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, పోలవరం నియోజకవర్గ అభ్యర్థి చిర్రి బాలరాజులు బుధవారం ఎన్నికల ప్రచారం కోరుతూ మండలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ దర్భగుడెం, జీలుగుమిల్లి, పి.రాజవరం, తాటియాకుల గూడెం పి.అంకంపాలెం, కామయ్యపాలెం, ములగలంపల్లి పంచాయతీల గుండా సాగింది. కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాము పాల్గొన్నారు.

జనసేనలోకి పలువురు

పోలవరం:మండలంలో టిడిపి, జనసేన కూటమి నాయకులు బుధవారం ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన కొండ, ఎస్‌సి సెల్ నాయకులు తాడేపల్లి మలాకీ, పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో బెస్తావీది, కమ్మరగూడెం, వడ్డీలపేటలలో ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో వివరించి ప్రచారం నిర్వహించారు. జనసేన నాయకులు కరాటం రాంబాబు కోండ్రుకోట పునరావాస కాలనీలో, పోలవరం పంచాయతీ గణేశ్ నగర్ ప్రాంతాలలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షులు చెంచాని ప్రసాద్, సెక్రటరీ వారాడి సత్తిబాబు, ఇతర తూర్పుకాపు నాయకులు జనసేనలోకి చేరారు. వారికి కరాటం రాంబాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

FORMAT –C1

DECLARATION ABOUT CRIMINAL CASES:

(As per the Judgment dated 25th September 2018 of the Hon'ble Supreme Court in W.P.(Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India and Anr)

Name and address of candidate	:	**SRINIVAS BOLISETTY** S/o. Satyanarayana (Late) Door No. 4-164/18, Ganesh Nagar Road, Ward-1, Tadepalligudem - 534101, West Godavari District, Andhra Pradesh
Name of political party	:	**JANASENA PARTY**
Name of Election	:	**Legislative Assembly of Andhra Pradesh (State)**
*Name Constituency	:	**62 - TADEPALLIGUDEM**

I, **SRINIVAS BOLISETTY,** a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents.

(A) Pending criminal cases

Sl. No	Name of Court	Case No. and dated	Status of case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1.	1st Additional Civil Judge (Junior Division) Court, Tadepalligudem	Case is pending trail vide CC No. 309/2022 crime No. 692/2021, Dtd. 23-09-2021 of Tadepalligudem Town Police Station	Case is pending trail	Under Section 342, 427, 506, 109 r/w 149 IPC Wrongfully confined and mischief causing damage and threatened with dire consequences along with others
2.	Not applicable (under stay by Hon'ble High Court)	Cr. No. 42/2020, Dtd. 18-01-2020 of Tadepalligudem Town Police Station	The Hon'ble High Court Stay pending vide CRLP No. 495/2020	U/s 353 IPC Assault or uses criminal force to the public servant in the execution of his duties
3.	Not Applicable (Under Investigation)	Cr.No. 1/2012, Dtd. 01-01-2012 in Tadepalligudem Town Police Station	Not filed charge sheet and pending investigation	Under Section 448, 427, 380, 323, 506 (2) r/w 34 IPC Criminally house tress passed and mischief causing damage and committed theft and voluntarily causes hurt and criminal intimidation along with others
4.	1st Additional Civil Judge (Junior Division) Court, Tadepalligudem	Cr. No. 69/2010 in Tadepalligudem Town Police Station CC No. 588/10	Trial not yet started	U/s 3 and 4 of APG Act, 1974 Suspected to be gaming in the house

(B) DETAILS ABOUT CASES OF CONVICTION FOR CRIMINAL OFFENCES

Case No.	Name of Court & date (s) of Order (s)	DESCRIPTION OF OFFENCE(S) & PUNISHMENT IMPOSED	MAXIMUM PUNISHMENT IMPOSED
1.	Not Applicable	Not Applicable	Not Applicable
2.	Not Applicable	Not Applicable	Not Applicable
3.	Not Applicable	Not Applicable	Not Applicable
4.	Not Applicable	Not Applicable	Not Applicable

Sd/-
SRINIVAS BOLISETTY
JANASENA PARTY MLA CONTESTING CANDIDATE
ANDHRA PRADESH STATE LEGISLATIVE ASSEMBLY 2024

ముఖ్య వార్తలు

గురువారం 9 మే 2024

కాంగ్రెస్‌తోనే మత్స్యకారులకు మేలు

మోకా చిన శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మత్స్యకారులకు అనేక రకాలుగా మేలు జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోకా చిన శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గొంది, నవరసాపురం గ్రామంలో చిన శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోకా చిన శ్రీనివాస్ మాట్లాడుతూ వేట విరామ సమయంలో భృతి పెంచుతామని అన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్ నాయుడు, ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి బుజ్జిని హస్తం గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే ఉపాధి అవకాశాలు

నరసాపురం నియోజకవర్గ అభ్యర్థి కానూరి బుజ్జి

ప్రజాశక్తి - నరసాపురం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కాంగ్రెస్ నరసాపురం నియోజకవర్గ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర కృష్ణప్రసాద్(బుజ్జి) అన్నారు. బుధవారం పట్టణంలోని మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్డు, మార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో చేనేత కార్మికులకు చేయూత ఇచ్చేదన్నారు. వ్యాపారస్తులను ప్రభుత్వం ఏవిధంగాను పట్టించుకోవడం లేదని, జిఎస్‌టి వల్ల వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నరసాపురం సఖినేటి పల్లి వంతెన, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు,సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పాతపాడు గ్రామం నుంచి ప్రజాశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లు వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఎంపీ అభ్యర్థి గూడూరు ఉమాబాల, ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజుల ఎన్నికల ప్రచారం గురువారం చేయనున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ ప్రచారంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నరసాపురం: వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు గెలుపు కోసం మండలంలోని వేములదీవి వెస్ట్ గ్రామంలో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముదునూరి ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు, అల్లుడు అడ్డూరి అనిర్వినా పాల్గొన్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.

మండలంలోని రుస్తుంబాద గ్రామంలో ముదునూరి ప్రసాదరాజు సతీమణి శారదా వాణి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

'టిడిపి గెలుపు ఖాయం'

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్రంలో టిడిపి, జనసేన కుటమి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు అన్నారు. పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి మోళ్ళపర్రులో బుధవారం జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సతీమణి సునీతతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు అందించి వివరించారు.

టిడిపి కూటమి, వైసిపిలను నమ్మి మోసపోవద్దు

కాంగ్రెస్ అభ్యర్థి మరీదు కృష్ణ

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రచారంలో మరీదు కృష్ణ

సిపిఎం, సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి మరీదు కృష్ణ బుధవారం చాట్రాయి మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మంకుల్లు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఎపిని టిడిపి, వైసిపి రెండు పార్టీలు మోడీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టే పార్టీలేనన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని మర్చిపోయి ప్రజలకు పది రూపాయలు ఇచ్చి, 20 రూపాయలు తిరిగి ప్రజలపై మోపాలని చూస్తున్నారన్నారు. టిడిపి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలు సాధ్యం కాదని, అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు చూస్తున్నారని అన్నారు. ఈ రెండు పార్టీల నాయకులను నమ్మి ఓట్లు వేయవద్దని, సుస్థిరమైన పరిపాలన, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యమని అన్నారు. ఆలోచించి ఓటర్లు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిడి.రవికుమార్, నూజివీడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, చాట్రాయి మండల సిపిఎం నాయకురాలు మేడిపల్లి హెూలీ మేరీ, సిపిఎం నాయకులు కొమ్ము ఆనందం, సిపిఐ నాయకులు పెనుమత్స రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఇండియా వేదిక గెలుపుతోనే ఉపాధి చట్టానికి రక్షణ

ప్రజాశక్తి - కలిదిండి

ప్రచార కార్యక్రమంలో మహంకాళీరావు

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళీరావు అన్నారు. మండలంలోని మూలలంకలో ఉపాధి కూలీలను కలిసిన ఆయన కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను, కాంగ్రెస్ కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్‌ను గెలిపించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 10 ఏళ్లలో ఉపాధి హామీ చట్టం నిధులు తగ్గించి, పేదల పొట్ట కొట్టిందన్నారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు నెరవేర్చకుండా, పోలవరం ప్రాజెక్టుకు, నిర్వాసితులకు నిధులు మంజూరు చేయకపోవడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. అందుకే బిజెపిని, బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేనను, బిజెపికి తొత్తుగా ఉన్న వైసిపిని ఓడించి ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థులైన బొడ్డు నోబుల్, కావూరి లావణ్యను గెలిపించేందుకు హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో నాయకులు ఎన్.మహాలక్ష్మి, ఎం.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం..

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

ప్రజాశక్తి - చాట్రాయి

మాట్లాడుతున్న మహేష్ యాదవ్

టిడిపి అధికారంలోకి రాగానే చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి వాటి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. బుధవారం పుట్టా మహేష్ యాదవ్, టిడిపి నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి కొలుసు పార్థసారథి కుమారుడు నవీన్ కృష్ణ చాట్రాయి మండలంలోని పోలవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోలవరం గ్రామంలో మరిడి వెంకటేశ్వరరావు నాయకత్వంలో టిడిపి నాయకులు గజమాలతో ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పథకాలు అందించడం జరుగుతుందని అన్నారు. అభివృద్ధిని మర్చిపోయి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, యువ నాయకులు బొట్టు వంశీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు సృజన, లావణ్యలను గెలిపించాలి

సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రచార కార్యక్రమంలో సిపిఐ, కాంగ్రెస్ నేతలు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఓటరులను అభ్యర్థించారు. మండలంలోని బోడిగూడెం గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో జమ్మి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే ఇండియా వేదికతో పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలుపొందాలని అన్నారు. ప్రత్యేక హోదా కావాలన్నా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని తెలిపారు. తమ అమూల్యమైన ఓటును పోలవరం నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి దువ్వెల సృజనకు హస్తం గుర్తుపై, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిని కావూరి లావణ్యకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని శ్రీనివాసరావు బోడిగూడెం గ్రామ ప్రజలను గడపగడపకూ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సింగవరపు అద్దయ్య, వి.సత్యనారాయణ, శ్రీను, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

అబ్బయ్య చౌదరి విస్తృత ప్రచారం

ఏలూరు టౌన్: వైసిపి దెందులూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి పెదవేగి మండలంలోని వంగూరు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని చూసి ఆశీర్వదించాలని, ఫ్యాను గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదవేగి మండలంలోని కవ్వగుంట, గార్లమడుగు గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం అబ్బయచౌదరి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత అబ్బయ్య చౌదరికి ప్రజలు, వైసిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ వచ్చి మీ సమస్యలను తెలుసుకొని పరిష్కరించామన్నారు. గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఐ నేతలు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ ఇంటింటి ప్రచారంలో భాగంగా బుధవారం పాత చింతలపూడి గ్రామంలో సిపిఐ కార్యకర్తలు తెలిపారు. ఇండియా వేదిక అభ్యర్థులని గెలిపించాలని, మతోన్మాద బిజెపిని ఓడించాలని పిలుపునిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, శాఖ కార్యదర్శి ముల్లగిరి నాగేశ్వరావు, మండల కమిటీ సభ్యులు బోడ వజ్రం, మల్లగిరి లాజరు, సరిపెల్లి లెనిన్, తొర్లపాటి రాజు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు టిడిపితోనే ఉపాధి

చెన్నంశెట్టి హరి నాయుడు

ప్రజాశక్తి - ఉండి

నిరుద్యోగ యువతకు టిడిపితోనే ఉపాధి కలుగుతుందని నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు అన్నారు. బుధవారం ఉండిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చెన్నంశెట్టి హరినాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చిన జగన్ మోహన్ రెడ్డి యువతను మోసం చేశాడని విమర్శించారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు ప్రతినెలా నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందించడం జరుగుతుందని, ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఉండి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజును భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కల్లేపల్లి సతీష్ రాజు, బండారు శ్రీనివాసరావు, జనసేన మండల ఉపాధ్యక్షులు యర్రా రవి, మోపిదేవి హరి పాల్గొని టిడిపికి ఓట్లు వేయాలని ఓటర్లను కోరారు.

కొట్టు నైతికంగా ఓటమి అంగీకరించినట్టే : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి అభ్యర్థి కొట్టు సత్యనారాయణ నైతికంగా ఓటమిని అంగీకరించినట్టేనని జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం పెంటపాడు, దర్శిపర్రు, బిల్ల గుంట, బోడపాడు గ్రామాల్లో బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీలతో కలిసి తన తండ్రి బొలిశెట్టి శ్రీనివాస్ విజయం కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తన తండ్రి బొలిశెట్టి శ్రీనివాస్ పేరు ఉన్న మరో బొలిశెట్టి శ్రీనివాసరావు బరిలోకి నిలిపి ఆ అభ్యర్థి ప్రచారాన్ని ఫోటో లేకుండా, నెంబరు సింబల్‌తో మాత్రమే ప్రచారం చేయించి, కూటమి ఓటర్లను కన్ఫ్యూజ్ చేయడానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఓటర్లు ఎంతో తెలివిగా ఓటు వేస్తారని, వారిని మభ్య పెట్టాలనే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. వలవల బాబ్జి మాట్లాడుతూ ప్రజలంతా వైసిపి కుట్రలు, కుతంత్రాలను తెలుసుకొని వారిని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మీరు జగన్‌ని తీసుకొచ్చి ప్రచారం చేయించుకున్నా, డమ్మీ అభ్యర్థులను నిలబెట్టి ప్రయత్నం చేసినా మీ ఓటమి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ మేలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వైసిపి పాలనలో ప్రతీ ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని, అందుకున్న ప్రతిఒక్కరూ ఓటేసి గెలిపించాలని భట్లమగటూరు సర్పంచి బి.సుగుణమ్మ కోరారు. బుధవారం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తూ అన్ని వార్డులకు తిరిగి ఆచంట అసెంబ్లీ, నరసాపురం ఎంపీ స్థానాలలో వైసిపి అభ్యర్థులను గెలిపించమని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ ఈది యాకోబు, మాజీ సర్పంచి సర్వేశ్వర రాజు పాల్గొన్నారు.

విస్తృతంగా రోషన్ కుమార్ ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి చంద్రబాబు పాలిస్తారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, కొనిచర్ల, మఠంగూడెం, తోచల కారాయుడుపాలెం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌వి నియంతృత్వ విధానాలని, వైసిపి నాయకులు ఆయన విధానాలతో విసిగి వేసారిపోయారన్నారు. పదవులు వదిలేసి భారీ సంఖ్యలో రాష్ట్ర భవిష్యత్తు కోసం వైసిపి నుంచి టిడిపిలోకి చేరుతున్నారన్నారు. కూటమి భారీ మెజార్టీతో అధికారంలోకి రాబోతుందన్నారు. గడిచిన ఐదేళ్ల సిఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని యువత భవిష్యత్ నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎస్‌సి తీస్తామని ఐదేళ్లు మభ్య పెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో సంక్షేమం కొరవడి సంక్షోభం నెలకొందన్నారు. జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు జరిగిన మేలు ఏమిలేదన్నారు. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమ పాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఉండి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. బుధవారం కాళ్లకూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా పిసిసి అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య మాట్లాడారు. కాంగ్రెస్ తొమ్మిది హామీల గురించి వివరించారు. రెండు లక్షల రైతు రుణమాఫీ, ప్రతి కుటుంబంలో మహిళకు నెలకు రూ.8,333, ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.400, ఐదు లక్షలతో పేదలకు గృహ నిర్మాణం, వృద్ధులకు పెన్షన్ రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైతులకు గిట్టుబాటు ధర, ఉచిత విద్య తదితర పథకాలను వివరించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెబిఆర్ నాయుడును, ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేసిన వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు కొండా రాజేష్ కుమార్, బొర్రా పార్థు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇండియా' అభ్యర్థుల గెలుపునకు సిపిఎం ప్రచారం

భీమవరంలో ప్రచారం చేస్తున్న ప్రజానాట్యమండలి కళాకారుడు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు ఆకాంక్షిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో విస్తత ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు గేయాలను ఆలపించి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.వలీ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ పదేళ్ల కాలంలో రాష్ట్రానికి దేశానికి చేసింది శూన్యమన్నారు. ఎన్నికల ముందు మోడీ ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలేదని, పైగా ప్రజలపై అనేక రూపాల్లో భారాలు వేశారని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానం చేసి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని తెలిపారు. పోలవరం నిర్మాణం, రాజధానికి నిధులివ్వడంలో గాని మోడీ ప్రభుత్వం ఆంధ్రా ప్రజలను దగా చేసిందని విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని, సిపిఎం, సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.నాగు, కె.కృష్ణ, బి.శ్రీరాములు, భార్గవ, శ్రీను, కళాకారులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటేస్తే భూములు గల్లంతే

టిడిపి తణుకు ఎంఎల్‌ఎ అభ్యర్థి రాధాకృష్ణ

ప్రచారం చేస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకురూరల్

వైఎస్ జగన్‌కు ఓటేస్తే భూములన్నీ గల్లంతవుతాయని టిడిపి తణుకు ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం అత్తిలి మండలం కంచుమర్రు, స్కిన్నెరపురం, ఈడూరు, కొమ్మర, పాలూరు గ్రామాల్లో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మీతో రోడ్ షో నిర్వహించారు. మధ్యాహ్నం దువ్వ, ముద్దాపురం గ్రామాల్లో కూటమి పార్లమెంటు అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టో హామీలను తెలియజేస్తూ సూపర్ సిక్స్ కార్యక్రమం ద్వారా రైతులు, మహిళలు, యువకులను ఆదుకుంటామని, అన్నివర్గాల ప్రజలకూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అప్పుల కోసం రాజధానిని, ప్రభుత్వ ఆస్తులను ఇప్పటికే తనఖా పెట్టేశారని, మరోసారి గెలిపిస్తే ప్రజల భూముల్ని కుదవ పెట్టి డబ్బులు తెచ్చుకుంటారని తెలిపారు. అటువంటి దుర్మార్గ పరిస్థితి పోవాలంటే వైసిపి ప్రభుత్వాన్ని చిత్తు చిత్తుగా ఓడించాలని కోరారు.

మహిళా శక్తి పథకాలను అన్ని చోట్ల స్త్రీలు స్వాగతిస్తున్నారని టిడిపి తణుకు ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. బుధవారం వేల్పూరు గ్రామంలో కూటమి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాధాకృష్ణ నాయకత్వం నియోజకవర్గానికి చాలా అవసరమన్నారు.

కైకలూరును అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి నోబుల్

ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నోబుల్

ప్రజాశక్తి - మండవల్లి

అవకాశం ఇస్తే కైకలూరు నియోజకవర్గాన్ని ఎన్నడూ లేని విధంగా అభివద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ స్పష్టం చేశారు. ఉనికిలో ఆయన కార్యకర్తలతో కలిసి పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ ఎంఎల్‌ఎలుగా గెలిచిన వ్యక్తులు ఎవరూ కైకలూరు అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. ఎంఎల్‌ఎ పదవిని తమ సొంత ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని విమర్శించారు. అందువల్ల కైకలూరు నియోజకవర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల్లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని అన్నారు. తమ అమూల్యమైన ఓటు ముద్రను హస్తం గుర్తుపై వేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో తనను గెలిపించాలన్నారు. అనంతరం స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరడానికి వచ్చిన వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆ గ్రామాలకు వెళ్లాలంటే.. పడవే గతి..

గోదావరి మధ్యలో అయోధ్యలంక

అభివృద్ధికి నోచుకోక లంకగ్రామాల ప్రజల అవస్థలు

పడవపైనే రాకపోకలు సాగిస్తున్న అయోధ్యలంక వాసులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఆచంట

అవును.. ఆ ఊరిని గోదావరే నిర్మించింది. వరదలు వచ్చినప్పుడు ఊళ్లు.. ఏరులు ఏకమైతే ఉగ్రగోదావరి ఆ ఊరికి మాత్రం ఒక సమగ్రరూపం ఇచ్చింది. వందల ఏళ్ల క్రితం సహజ సిద్ధంగా ఒక దీవిని నిర్మించింది. దాన్ని నివాసయోగ్యంగా మార్చేసుకున్నారు స్థానికులు. అదెలా అంటే.. వరదలకు ఎగువ నుంచి కొట్టుకొచ్చిన ఇసుకతో గోదావరి మధ్యలో పెద్దపెద్ద మేటలు ఏర్పడతాయి. అది ఒక్కసారి కిలోమీటర్ల మేర విస్తరిస్తాయి. ఈ విధంగా గోదావరి మధ్యలో ఏర్పడిన గ్రామమే అయోధ్యలంక. ఆ గ్రామాన్ని చేరుకోవాలంటే పడవ ఎక్కాల్సిందే. పచ్చని పంట పొలాలు, పశు సంపద, గలగలపారే గోదావరి, ఇసుక తిన్నెలు, చూడ చక్కని అందాలు అయోధ్యలంక సొంతం. ప్రభుత్వాలు దృష్టి సారిస్తే ఆ గ్రామం ఒక పర్యాటక కేంద్రం అయ్యేది. సహజంగానే బాహ్య ప్రపంచంతో సంబంధాలు అంతగా ఉండని ఆ లంక గ్రామాన్ని అభివృద్ధిపరంగా పట్టించుకోకపోవడంతో అక్కడివారు ఒంటరి తనం అనుభవిస్తున్నారు.

ఫోకస్

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలను ఆనుకుని ఏర్పడిన అయోధ్యలంక మైనర్ గ్రామ పంచాయతీ. మొదట్లో అయోధ్యలంక, భీమలాపురం పంచాయతీ పరిధిలో ఉండేది. 1981లో పంచాయతీగా ఏర్పడింది. మానుకొండ లక్ష్మణమూర్తి మొదటి సర్పంచిగా ఎన్నికయ్యారు. పంచాయతీ ఆదాయం రూ.లక్ష పంచాయతీ పరిధిలో మర్రిమూల, పుచ్చలంక, రాయిలంక ఉన్నాయి. అయోధ్యలంక, మర్రి మూలలు పూర్తిగా గోదావరి మధ్యలో ఉంటాయి. పుచ్చల్లంక, రాయిలంక తూర్పుగోదావరి జిల్లా నాగులంకను ఆనుకుని ఉన్నాయి. జనాభా ఎక్కువే. 4,000 మంది నివాసం ఉండగా, అయోధ్యలంక, మర్రి మూలల్లో 2000 మంది నివాసం ఉంటున్నారు. గ్రామంలో మొత్తం సుమారు 3000 మంది ఓటర్లు ఉన్నారు. రెండు హెల్త్ సబ్ సెంటర్లు, నాలుగు మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, యుపి స్కూల్స్ ఉన్నాయి. రెండు తుఫాను షెల్టర్లు ఉన్నాయి.

అయోధ్యలంకలో వారధి నిర్మాణానికి వేసిన శిలాఫలకం (ఫైల్‌ఫొటో)

వివిధ పంటలకు అనుకూలం..

ఇక్కడ సుమారు 1200 ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నారు. ప్రధానంగా కొబ్బరి, అరటి, మొక్కజొన్న, తమలపాకు, కూరగాయలు, అపరాలు పండిస్తున్నారు. ఒకప్పుడు రాగులు, నువ్వులు, పొగాకు వంటి పంటలు పండించినా కాలక్రమీణా కొబ్బరి సాగుకు లంకగ్రామం అనుకూలంగా మారింది. ఎక్కడ చూసినా నిండైన గెలలతో కొబ్బరి తోటలు కనిపిస్తుంటాయి. వ్యవసాయానికి అనుబంధంగా పశుసంపద కూడా పుష్కలంగా అభివృద్ధి చెందింది. విశాలమైన పశ్చికబయళ్లు ఉండడంతో పచ్చటి పశుగ్రాసానికి కొదవలేదు. ఇసుక నేలల కారణంగా వరికి మాత్రం ఆ గ్రామం దూరం.

వరదొస్తే ఒంటరి వారు..

మామూలు రోజుల్లోనే బాహ్య ప్రపంచంతో సంబంధ బాంధవ్యాలు అంతంతమాత్రంగా ఉంటాయి. గోదావరికి వరదొస్తే ఈ గ్రామం పూర్తిగా జలమయమవుతుంది. పంటలన్నీ కొట్టుకుపోతాయి. రహదారులు నీటమునిగి గోదావరిలో కలిసిపోతాయి. కరెంటు ఉండదు. చుట్టూ నీరు.. కూరగాయలు కరువు. గ్రామస్తులంతా వరద బాధితులవుతారు. ఈ తరహాలో ఏ ఇంట్లోనూ పొయ్యే వెలగదు. అందించిన ఆహార పొట్లాలే వారి ఆకలి తీరుస్తాయి. వరద తగ్గుతుంది నష్టం మిగులుతుంది. అరకొరగా పరిహారం అందుతుంది. మళ్లీ షరా మామూలే అదే ఊరు. అదే వ్యవసాయం, అదే వేట, అదే జీవితాలు పుట్టిన ఊరిపై కాసంత మమకారం సన్నగిల్లదు. ఎంత వరదొస్తే మాత్రం ఎన్నాళ్లు ఉంటుంది అదే పోతుంది. మేము మాత్రం ఇక్కడే ఉంటాం. ఇక్కడే చస్తాం అంటారు. ఆ గోదారమ్మే చూసుకుంటుందంటారు.

కోడేరులో వశిష్ట గోదావరి

పోటు, పాటు తెలిసిన వేటగాళ్లు..

లంకగ్రామాల్లో వ్యవసాయం కంటే మత్స్య సంపదే పలువురికి జీవనాధారం. మత్స్యకారులు అధికంగా ఉన్న అయోధ్యలంకలో జల చరాల కదలికలను వారు ఇట్టే పసిగట్టేస్తారు. ఏ సమయంలో ఏం దొరుకుతాయో ఎలా వట్టుకోవాలో వారికి వెన్నతో పెట్టిన విద్య. మార్కెట్లో డిమాండ్ ఉన్న పీతలు, రొయ్యలు, కొయ్యింగలు, పులసలు, పండుగప్పలు వంటి వాటిని ఎలా వేటాడాలో వారికే తెలుసు. పగటిపూట సాధారణంగా చేపల వేట, రాత్రి సమయంలో గోదావరి నీటిలో దీపం కాంతిని ప్రసరింపజేస్తారు. వాటికి రొయ్యలు, పీతలు ఆకర్షితం అవుతాయి. దీంతో సులువుగానే అవి వారి చేతికి చిక్కుతాయి. దీన్ని అనుభవపూర్వకంగా మత్స్యకారులు తాతల కాలం నుంచి నేర్చుకున్న విద్య. కుటుంబ పోషణకు మగవారితో సమానంగా మహిళలు కూడా శ్రమిస్తారు. వేటాడి తెచ్చిన మత్స్య సంపదను మహిళలు గంప నెత్తుకుని గోదావరి పరివాహక ప్రాంతాల్లో కాలినడకన తిరుగుతూ అమ్ముతారు.

ప్రాణాంతకంగా పడవ ప్రయాణం..

ఆ ఊరికి వాహనాలు వెళ్లవు. పడవ ప్రయాణమే దిక్కు. తూర్పుగోదావరి జిల్లా వాస్తులైతే గన్నవరం మీదుగా నడిగాడిరేవు, నాగులంక సమీపంలోని పుచ్చలంక రేవు దాటి అయోధ్యలంక చేరుకుంటారు. పశ్చిమ వాసులైతే భీమలాపురం, కరుగోరుమిల్లి రేవులు దాటి వెళ్తారు. నిత్యం పడవపై ప్రయాణించే లంకవాసులకు సమయం వృథా అవుతుంది. వీరంతా పశ్చిమ వాసులైనా అన్ని అవసరాలకూ తూర్పుగోదావరి జిల్లా వెళ్లాల్సిందే. అధికారమైన అవసరాలు పశ్చిమతో ముడిపడి ఉన్న నిత్యావసరాల కోసం తూర్పుగోదావరి జిల్లా వెళ్లాలి. ప్రమాదంతో కూడిన ప్రయాణం కావడంతో కొందరు నీటమునిగి ప్రాణాలు కోల్పోయారు.

వారధి నిర్మాణం వట్టి మాటేనా..

వరదలొచ్చిన ప్రతిసారీ ప్రజాప్రతినిధులొచ్చి ఏదో హామీ ఇస్తూనే ఉంటారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అయోధ్యలంక వారధి నిర్మిస్తామన్నారు. దీంతో లంకవాసులు సంబరపడిపోయారు. వంతెన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేయడంతో పండుగ చేసుకున్నారు. కాలం గడిచిపోయింది. ప్రభుత్వాలు మారిపోయాయి. ఆయన మాజీ మంత్రి అయ్యారు. వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. మరలా ఎన్నికలు రావడంతో 2019లో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఎంఎల్‌ఎగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు విజయం సాధించారు. లంక గ్రామాల్లో ఇప్పటికీ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసి గ్రామస్తులకు సురక్షిత తాగునీరు అందజేశారు. ఈ తరహాలో గోదావరిపై వారధి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. లంక గ్రామాలను కలుపుతూ గోదావరిపై వంతెన నిర్మిస్తామని పాలకులు హామీలు ఇస్తున్నా ఆచరణలో సాధ్యం కాని పరిస్థితి. లంక గ్రామాల అభివృద్ధి అంతా వంతెనతోనే ముడిపడి ఉంది. కోడేరు నుంచి తూర్పుగోదావరి జిల్లా గన్నవరం వరకూ గోదావరి వంతెన నిర్మాణం కలగా మారింది. ఇది నిర్మిస్తే ఉభయగోదావరి జిల్లా వాసులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

ఆత్మగౌరవం కోసమే పోటీ

కాంగ్రెస్ చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

'రాష్ట్ర ప్రజలకు మద్యం, డబ్బు కంటే ప్రత్యేక హోదా చాలా విలువైంది. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలే కాంగ్రెస్ ప్రాధాన్యం. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. బిజెపి ఒకపక్క రాజ్యాంగాన్ని మార్పు చేసి రిజర్వేషన్లు రద్దు చేసేలా ముందుకెళ్తోంది. రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి వాటి గురించి ఏమీ పట్టించుకోకుండా బిజెపికి వత్తాసు పలుకుతున్నాయి. బిజెపిని ఎదుర్కొనే దమ్ము ఒక ఇండియా వేదికకు మాత్రమే ఉంది' అని కాంగ్రెస్ చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా తెలిపారు. వైసిపి రెండోసారి టిక్కెట్ కేటాయించకపోవడం తదితర కారణాల రీత్యా కాంగ్రెస్ గూటికి చేరిన ఎలిజా ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న సంగతి తెలిసిందే. అత్యంత జోష్‌తో నామినేషన్ వేయడమే కాకుండా వెనువెంటనే పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను ఆహ్వానించి చింతలపూడిలో బహిరంగ సభ నిర్వహించడం ద్వారా ఇండియా వేదికకు ఒక ఊపు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎలిజా ప్రజాశక్తి పలుకరించింది. తాను ఆత్మగౌరవం కోసం పోటీ చేస్తున్నానని, తనను నమ్మించి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెత్తందారుల చేతుల్లో బలయ్యానని, అయినా సమస్యలకు భయపడి పారిపోయే రకం కాదని, ప్రాణమున్నంత వరకూ ఆత్మగౌరవం కోసం పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా ఉంది?

ఎలిజా: ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రజల నుంచి స్పందన బాగుంది. ప్రధాన పార్టీల కంటే ప్రచారంలో ముందున్నాను. సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రచారం జోరు పెంచాం.

ప్రశ్న: ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

ఎలిజా: ప్రతి కుటుంబానికీ నేను తెలుసు. నా వల్ల లబ్ధి పొందిన వారూ ఉన్నారు. వారి అభిమానం నాపై ఉంది. వారి నుంచి మద్దతు లభిస్తోంది. వారు వేరే పార్టీలో ఉన్నా ఓటు నాకే వేస్తారు. గత ఆరు సంవత్సరాల నుంచి ప్రజల్లో తిరుగుతున్నా. నాపై వారికి ఎనలేని అభిమానం ఉంది.

ప్రశ్న : ప్రధాన పార్టీలు మద్యం, డబ్బుతో ముందుకెళ్తున్నాయనే ప్రచారం నడుస్తోంది? మీరు ఏవిధంగా ఎదుర్కొంటారు?

ఇది చాలా బాధాకరం. ప్రజలందరూ ఆలోచించాలి. మద్యం, డబ్బు చూసి ఓటేయకూడదు. ప్రజలకు ఏవిధంగా సేవ చేస్తారో చూసి వారికి మాత్రమే ఓటు వేయాలి. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంపాదించే వారికి ఓటేయొద్దు. ప్రజలకు సేవ చేసే వారిని గుర్తించండి. వారికి మాత్రమే ఓటేయండి. ప్రజలకు నగదు, మద్యం కంటే ప్రత్యేక హోదా ముఖ్యం. యువతకు ఉద్యోగాలు ముఖ్యం. రైతులకు రుణమాఫీ ముఖ్యం. ప్రజలందరూ ఆలోచించి ఓటేయాలి.

ప్రశ్న: కేంద్రంలోగాని, రాష్ట్రంలోగాని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చింతలపూడి నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారు?

ఎలిజా: వైసిపి ప్రభుత్వం ఐదేళ్లకుగాను చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి కోటి రూపాయలు మాత్రమే నిధులిచ్చింది. దాంతో చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు. కేంద్రంలోగాని, రాష్ట్రంలోగాని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటాను. రోడ్లు, డ్రెయినేజీలు, వీధిదీపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తాను. చింతలపూడి మండలానికి పాలిటెక్నిక్ కాలేజీ తీసుకొస్తాను. నాకు నిధులివ్వకపోవడం వల్ల అభివృద్ధి చేయలేకపోయాను. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏ విధంగా అభివృద్ధి చేస్తానో ప్రజలే చూస్తారు.

ప్రశ్న: బిజెపి అధికారంలోకి రాగానే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ప్రచారం ఉంది? దీనిపై మీరెలా స్పందిస్తారు?

ఎలిజా: అంబేద్కర్ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల కోసం రిజర్వేషన్లు కేటాయించారు. రిజర్వేషన్ అనేది ప్రాథమిక హక్కు. దీన్ని కొనసాగించాలి. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అందరికీ హక్కులు కల్పించారు. పెత్తందార్లు కూడా దీనిపై స్పందించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు సుభిక్ష పరిపాలన అందించాలంటే అది కాంగ్రెస్, ఇండియా వేదికతోనే సాధ్యం.

ప్రశ్న : సిపిఎం, సిపిఐ మద్దతు ఎలా ఉంది?

ఎలిజా: సిపిఎం, సిపిఐ పూర్తి మద్దతు ఉంది. గ్రామాల్లో ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. సమయం తక్కువ ఉండడంతో ఖాళీ లేకుండా ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నాను.

ప్రశ్న : 2024లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారా?

ఎలిజా: కేంద్రంలో 2024లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు. ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధి కోసం రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని నమ్ముతున్నాం.

ప్రశ్న: చింతలపూడి నియోజకవర్గ ప్రజలకు మీరేం చెప్పదలుచుకున్నారు?

ఎలిజా: ప్రజలు ఆలోచించి ఓటేయాలి. మీరు వేసే ఓటు ఐదు సంవత్సరాల వరకూ మీరే బాధ్యత వహించాలి. అభివృద్ధి, సేవ చేసేవారికి పట్టం కట్టండి. మద్యం, డబ్బు రాజకీయాలకు స్వస్తి చెప్పి, అభివృద్ధి, సేవ సంక్షేమానికి పట్టం కట్టండి.

అధికారంలోకొస్తే రూ.500కే గ్యాస్

కాంగ్రెస్ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు

ప్రచారం చేస్తున్న హరికుమార్ రాజు

ప్రజాశక్తి - గణపవరం

కేంద్రం రాష్ట్రాల్లో ఇండియా వేదిక అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని, ఖాళీగా ఉన్న ప్రభుత్వోద్యోగాలు వంద రోజుల్లో భర్తీ చేస్తామని ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన పిప్పరలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ రాజు మాట్లాడారు. సిపిఎం నాయకులు ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి ప్రతి నిరుద్యోగికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఎపికి ప్రత్యేక హోదా అమలు చేయడం ఇండియా వేదిక మాత్రమే చేయగలదన్నారు. ప్రతినెలా రేషన్ కార్డు ద్వారా ప్రజలకు సన్న బియ్యం, తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు అందిస్తామని చెప్పారు. తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, ఎం.పెంటారావ్, చిన్నం చిన్న నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ ఉంగుటూరు నియోజకవర్గం అధ్యక్షులు ఎర్రంశెట్టి ఏడుకొండలరావు, లీగల్‌సెల్ కన్వీనర్ శ్రీధర్ ఉంగుటూరు నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఎర్రంశెట్టి సాయి, నాగబాబు, కాంగ్రెస్ గణపవరం మండల అధ్యక్షులు జె.చంద్రశేఖర్, నాయకులు మేకా ధనంజయ, ప్రభాకర్ పాల్గొన్నారు.

అరాచక పాలనను సాగనంపండి

టిడిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి సత్యనారాయణ

మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

ఆచంట: రాష్ట్రంలో అరాచక అవినీతి పాలనను అంతమొందించేందుకు యువత భాగస్వాములు కావాలని టిడిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆచంట కమ్మ సంఘం కళ్యాణ మండపంలో బుధవారం టిడిపి, జనసేన, బిజెపి యువత ఆత్మీయ సమ్మేళనం టిడిపి యువత మండల అధ్యక్షులు కేతా మురళి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పితాని పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ముఖ్యంగా యువత నడుం కట్టిందన్నారు. యువత కంకణం కట్టుకుంటే ఈ దుర్మార్గులంతా మాడి మసైపోతారన్నారు. నియోజకవర్గంలో రంగనాథరాజు అవినీతికి పరాకాష్ట అని విమర్శించారు. టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్నారని, కూటమి ప్రభుత్వం విజయానికి తోడ్పాటు అందించే విధంగా మేనిఫెస్టో ఉందని తెలిపారు. అడుగడుగునా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 170 స్థానాల్లో కూటమి అభ్యర్థులతో 25 పార్లమెంట్ కూటమి అభ్యర్థులకు విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో దొంగ సారథి, పితాని వెంకట్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటేష్, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి డి.సూర్యకుమారి, బి.దుర్గాప్రసాద్, సిర్రా బాలాజీ, జవ్వాది బాలాజీ శ్రీనివాస్, చిట్టూరి శ్రీనివాస్, జి.శ్రీరాములు, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న నిమ్మల రామానాయుడు

జగన్ మళ్లీ వస్తే ప్రయివేటు ఆస్తుల దోపిడీ : నిమ్మల

పోడూరు: రాష్ట్రంలో జగన్‌కు మళ్లీ అవకాశం ఇస్తే ప్రయివేటు ఆస్తులను దోపిడీ చేస్తాడని, రక్షణ ఉండదని అన్ని వర్గాల ప్రజలూ భయందోళన వ్యక్తం చేస్తున్నారని, ఆయనను జరగబోయే ఎన్నికల్లో ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని టిడిపి పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో భాగంగా బుధవారం వద్దిపర్రు గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. అన్ని వర్గాల ప్రజలకూ అందుబాటులో ఉండే తనను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ జగన్‌కు ఒకసారి ఛాన్స్ ఇస్తే ప్రజల జీవితాలను నాశనం చేశాడని, మరోసారి ఇస్తే భూ యాజమాన్య హక్కు చట్టం అమలు ద్వారా తరతరాలుగా సంపాదించుకున్న సొంత ఆస్తులకే రక్షణ ఉండదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ప్రచారంలో నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, శీలం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, బుద్ధరాజు వాసురాజు, తిరుమాని దుర్గాప్రసాద్, సర్పంచి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దుబాయ్ తరహా అభివృద్ధి సాధ్యం

సస్యశ్యామలం సేవా సంస్థ వ్యవస్థాపకులు కలిదిండి భగవాన్ రాజ్ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

చిన్న రాష్ట్రాలతో హాంకాంగ్, మలేషియా, దుబాయ్ తరహా అభివృద్ధి సాధ్యమని, రాయలసీమ లేని ఆంధ్రప్రదేశ్ కోసం నిర్మాణాత్మక పాత్రను పోషిస్తామని సస్యశ్యామలం సేవా సంస్థ వ్యవస్థాపకుడు కలిదిండి భగవాన్‌రాజు అన్నారు. బుధవారం భీమవరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించి ప్లకార్డులు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమతో ప్రత్యక రాష్రం ఏర్పాటు కావాలని, అక్కడ నుంచి వాదనలు వచ్చాయని, అయితే సీమాంధ్రతో కొత్త రాష్ట్రం ఆవిర్భవించిందని రాయలసీమ, కోస్తాంధ్ర విడివిడిగా ఉండటమే మేలని తెలిపారు. ప్రతి గ్రామం, మండల కేంద్రం, జిల్లా కేంద్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా తాము కృషి చేస్తామన్నారు. నరసాపురం పార్లమెంటును రెండుగా విభజించాలని, ప్రస్తుతం జిల్లాలో ఉన్న

ప్లకార్డులు ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏడు అసెంబ్లీ స్థానాలను మరో రెండుకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పురాతన నరసాపురం ఓడ రేవును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రణాళిక వేస్తున్నామని, తక్షణం కోస్తా జిల్లాలను ఆక్వా జోన్ గా ప్రకటించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ముదుండి రవి వర్మ, కలిదిండి శోభారాణి పాల్గొన్నారు.

తాడిచెట్టు ఎక్కుతున్న శివరామరాజు

తాడి చెట్టెక్కిన శివరామరాజు

గీత కార్మికులకు అండగా ఉంటానని భరోసా

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నికలు వస్తే చిత్ర విచిత్రాలు జరుగుతూ ఉంటాయి. అభ్యర్థుల ఓట్లు అభ్యర్థించేందుకు నానా పాట్లు పడుతూ ఉంటారు. ఏదో ఒక విధంగా ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. ప్రతి ఇంటి మెట్లూ ఎక్కడమే కాకుండా అవసరమైతే ఫీట్లు కూడా ఎక్కాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఉండి ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వేటూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ఓట్లు అభ్యర్థించడంతోపాటు ఓటర్లను ఆకర్షించేందుకు ఏకంగా తాడిచెట్టు పైకెక్కరు. మొగల్లులో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో శివరామరాజు స్థానికంగా గీత కార్మికులు గీత గీస్తున్న సమయంలో వారిని ఓట్లు అభ్యర్థించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనకు ఓట్లేసి గెలిపిస్తే గీత కార్మికులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం గీత కార్మికుడు మోకిని ధరించి తాడిచెట్టు పైకి ఎక్కి వినోదం రీతిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

కాంగ్రెస్ తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కడలి రామారావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

రైతుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఇండియా వేదిక తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ తణుకు అభ్యర్థి కడలి రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి. ప్రతాప్ అన్నారు. బుధవారం స్థానిక ఉండ్రాజవరం సెంటర్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కడలి రామారావు, ప్రతాప్ మాట్లాడుతూ మోడీ పదేళ్ల కాలంలో ఎపికి చేసిందేమీలేదన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని మోడీ మోసం చేశారన్నారు. ఎపికి బిజెపి పదేళ్లుగా ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. అనేక సంవత్సరాలగా రైతులు స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని పోరాటం చేస్తున్నా మోడీ పట్టించుకోవడం లేదన్నారు. ధరలు తగ్గించాలంటే అందరూ సిపిఎం, సిపిఐ బలపర్చిన హస్తం గుర్తుకే ఓట్లు వేయాలన్నారు.

ప్రచారం చేస్తున్న కడలి రామారావు

కార్యక్రమంలో ఆకుల సాయి, పప్పు కాశీ, గార రంగారావు, మల్లిపూడి లక్ష్మి, చుక్కకూల వరలక్ష్మి, రుద్ర చినసత్యం, దిర్శిపో శాంతారావు, బి.త్రిమూర్తులు, పి.లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

FORMAT –C1

Declaration about criminal cases:

(As per the Judgment dated 25th September 2018 of the Hon'ble Supreme Court in W.P.(Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India and Anr)

Name and address of candidate : **MEDAPATI VENKATA VARAHALA REDDY**
S/. Ramakrishna Reddy, D.No. 1-10A,
Pemmaraju Polavaram
Poduru Mandalam, W.G.Dt., AP-534338

Name of political party : **INDEPENDENT**

Name of Election : **GENERAL ELECTION TO HOUSE OF PEOPLE (PARLIAMENT) - 2024**

*Name Constituency : **9 - NARASAPURAM PARLIAMENT CONSTITUENCY**

I, **MEDAPATI VENKATA VARAHALA REDDY** (NAME of the Candidate), a candidate for the Above mentioned election,declare for public information the Following Details about my criminal Antecedents.

(A) Pending criminal cases

Sl. No	Name of Court	Case No. and dated	Status of case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1	Principal Judicial First Class Magistrate, Palakollu	FIR No. 133/2020, C.C. 491/2021	Appearance of accused Posted to 21-05-2024	Sec. 188, 406 R/w 34 of I.P.C. and Sec. 21(1) Mines and Minerals

Sd/- **MEDAPATI VENKATA VARAHALA REDDY**
Independent MP Contesting Candidate, Narasapuram Parliament Constituency - 2024

'బిసిలకు తోడ్పాటు అందించింది టిడిపినే'

కాళ్ల: బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటును అందించింది టిడిపి అని మాజీ మంత్రి, బిసి ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర అన్నారు. ప్రాతళ్లమెరక గ్రామంలో జయహో బిసి సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బిసిలు రాజకీయంగా ఎదగాలనే లక్ష్యంగా టిడిపి స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, వైసిపి ప్రభుత్వం రిజర్వేషన్లు 24 శాతానికి కుదించిందన్నారు. రాష్ట్రంలో బిజెపి మద్దతుతో జనసేన, టిడిపి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్, బిసిల అభ్యున్నతికి ఐక్యంగా జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సదస్సులో డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, గవర లక్ష్మి, సర్పంచి కంతేటి ఉష శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాలి

భీమవరం రూరల్: ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడడంతో వైసిపి భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల ప్రచారం జోరు పెంచారు. బుధవారం భీమవరం మండలంలోని కొవ్వాడ, నర్సింహాపురం, కొవ్వాడ అన్నవరం, చిన ఆమిరం, రాయలం గ్రామాల్లో ఉమాబాలతో కలిసి ఆయన విస్తత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రచారంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచులు పాల్గొన్నారు.

10న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు రాక

(మొదటి పేజీ నుంచి)

తరపున కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి విస్తృతంగా ప్రచారం, సభలు, సమావేశాలు, జనరల్‌బాడీలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

క్రాస్‌ఓటింగ్.. గుబులు..!

(మొదటి పేజీ నుంచి)

ఈయన సైతం గెలుపోటములను ప్రభావితం చేసే విధంగా ముందుకు సాగుతున్నారు. బిజెపి అభ్యర్థి పూర్తిగా టిడిపి, జనసేన బలంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో బిజెపి నాయకుల్లో ఓటమి గుబులు నెలకొందనే చర్చ నడుస్తోంది. ఓటర్లు ఏ విధంగా తీర్పు ఇస్తారో జూన్ నాలుగో తేదీ వరకూ వేచిచూడాల్సిందే.

శివయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

(మొదటి పేజీ నుంచి)

కార్డున్నా సహజ సిద్ధ మరణంగా గుర్తించామని, ఆత్మహత్యకు తప్ప గుండెపోటుతో అకాల మరణం చెందితే ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం ఉండదని చెప్పడం దారుణమన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కౌలురైతు కుటుంబానికి రూ.ఐదు లక్షలు పరిహారం ఇవ్వాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు.

రోడ్డుపై జారిపడి పలువురికి గాయాలు

మట్టి ట్రాక్టర్లను నియంత్రించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - వీరవాసరం

రోడ్లుపై పడి ఉన్న మట్టి పెడల వల్ల పలువురు గాయాలపాలైనారు. వీరవాసరం మత్స్యపురి ఆర్ అండ్ బి రహదారిపై మట్టి ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌లోని మట్టి రోడ్లపై పడుతుంది. దీంతో రోడ్డంతా మట్టిపెడలతో నిండిపోయింది. ఈనెల 7వ తేదీన కురిసిన వర్షం వల్ల రోడ్డుపై పడ్డ మట్టి వర్షం నీటికి నాని జారుడు మట్టిగా తయారైంది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్రవాహణాలు జారుడు మట్టి వల్ల జారి పలువురు ప్రమాదాలకు లోనైనారు. ఈ విధంగా ఒక మహిళ చేతికి తీవ్ర గాయమవగా, మత్స్యపురికి చెందిన మరో కొత్త ద్విచక్రవాహనం స్వల్పంగా ధ్వంసమైంది. గత కొద్ది రోజులుగా మట్టి ట్రాక్టర్లు ఇష్టానుసారంగా తిరుగుతున్నాయి. వీటిని నియంత్రించే అధికారులే కరువయ్యారు. ఎన్నికల విధులు పేరుతో ఏ అధికారి ఎక్కడ పని చేస్తున్నారో తెలియడం లేదు. దీంతో అధికారులు స్థానికంగా లేరన్న సమాచారంతో నిబంధనలకు విరుద్ధంగా మట్టి ట్రాక్టర్లు తిరగడంతో ప్రజలు ప్రమాదాల భారిన పడుతున్నారు. తక్షణమే మట్టి ట్రాక్టర్లను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

జారుడు మట్టిగా ఉన్న రోడ్డు

టిడిపి వస్తే జన్మభూమి కమిటీలు పుట్టుకొస్తాయ్..

మాజీ మంత్రి, వైసిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ

పెనుమంట్ర: చంద్రబాబు చెప్పే గారడీ మాటలకు మోసపోతే రాష్ట్రంలో తిరిగి జన్మభూమి కమిటీలు వచ్చి నిరుపేదలు బలికావాల్సి వస్తుందని మాజీ మంత్రి, వైసిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు హెచ్చరించారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు నేరుగా ఎటువంటి పైరవీలు లేకుండా పారదర్శకంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వాలంటీరు వ్యవస్థలను తీసుకువచ్చారని అన్నారు. దీంతో ఎవరి చుట్టూ తిరగకుండా పథకాల లబ్ధి నేరుగా పేదల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. అయితే చంద్రబాబు, కూటమి నాయకుల పథకం ప్రకారం కుయుక్తులు పన్ని వాలంటీర్లకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్ని చేసినా ప్రజలకు వాస్తవాలు తెలుసునని, ఆచంట నియోజకవర్గంలో వైసిపి మరోసారి జెండా ఎగురవేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

వైసిపి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

వైసిపి ఆచంట అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆచంట: సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైసిపి ఆచంట అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పిలుపునిచ్చారు. పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన తూర్పు కాపు సామాజిక వర్గం మహిళలు, యువతతో పాటు 200 కుటుంబాలు ఎంఎల్ఎ చెరుకువాడకు మద్దతు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తూర్పుపాలెం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి కేవలం వైఎస్ జగన్మోన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమన్నారు. చంద్రబాబు చెప్పేవి సూపర్‌సిక్స్ కాదని, ఆరు మోసాలని వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మీడియా సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మీడియా సిబ్బంది బాధ్యతతో పనిచేసి సామాజిక గౌరవం పొందాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ కోరారు. గంధం సురేష్ స్మారక ఎలక్ట్రానిక్ మీడియా జిల్లాస్థాయి ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంధం సురేష్ జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల తోడ్పాటుతో తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు పురస్కారాలను గత సంవత్సరం ప్రవేశపెట్టామని అన్నారు. జిల్లా స్థాయిలో ఎలక్ట్రానిక్ మీడియా ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారాన్ని ఎన్‌టివి స్టాఫ్ రిపోర్టర్ పి.మల్లికార్జున రావుకు, ఉత్తమ వీడియో జర్నలిస్ట్ పురస్కారాన్ని టివి 5 గౌస్‌కు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారాన్ని ఎబి.ఎన్ విలేఖరి పాలడుగు సతీష్‌కు ప్రదానం చేశారు.

జనసేనలోకి నాగ గోవిందరావు

పెనుగొండ: బిసి సామాజిక తరగతికి చెందిన కడలి రామ్ నాగ గోవిందరావు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో వైసిపి నుంచి జనసేనలోకి చేరారు. బుధవారం సిద్ధాంతం చివర ఘటాల దిబ్బలో ఇంటి దగ్గర విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడుతూ వైసిపికి రాజీనామా చేసి జనసేనలోకి చేరానన్నారు. ఈ నియోజకవర్గంలో వైసిపికి అనేక సేవలు కొనసాగించామని, నాయకులు ఇష్టం లేక ఇప్పుడు టిడిపి, జనసేన కూటమిక గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి చెట్టు వెంకటేష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ఆత్మీయ సమావేశం

కాళ్ల: గెలుపే లక్ష్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణంరాజు కోరారు. కోమటిగుంట గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపిల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. వైసిపి నాయకులు బోణం శివకుమార్, వైసిపి గ్రామ అధ్యక్షులు నక్కా శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు పసుపులేటి శ్రీనివాస్, పళ్ళ శ్రీనివాసులు సుమారు 30 మంది వైసిపి నాయకులు టిడిపిలోకి చేరారు.

'మహిళా సాధికారత వైసిపితోనే'

ఉండి: మహిళా సాధికారత వైసిపితోనే సాధ్యపడుతుందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడిద వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఉండి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏడిద వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు.

Format C-1

Declaration about criminal cases:

(As per the judgment dated 25th September 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate: ARIMILLI RADHA KRISHNA
S/o Chakradhararao, 20-176, Maha Lakshmi Cheruvu, Road, Beside AVR and Co Rice Mill, Velpur.

Name of political party : TELUGU DESAM PARTY

Name of Election : Andhra Pradesh State Legislative Assembly-2024 (General)

Name of Constituency : No.61-TANUKU ASSEMBLY CONSTITUENCY

I **ARIMILLI RADHA KRISHNA**, a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending criminal cases

Sl. No.	Name of Court	Case No. and Dated	Status of case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1	Not Applicable	Cr.No.186/2023 Tadepalligudem Town PS	Under investigation	**U/S 142, 341, 323, 188 r/w 149 IPC** It is alleged that myself and others conducted nirasana programme at Tadepalligudem regarding arrest of Ex CM Sri Nara Chandra Babu Naidu
2	Not Applicable	Cr.No.187/2023 Tadepalligudem Town PS	Under investigation	**U/S 143, 341, 188 r/w 149 IPC** It is alleged that myself and others conducted nirasana programme at Tadepalligudem regarding arrest of Ex CM Sri Nara Chandra Babu Naidu
3	Not Applicable	Cr.No.191/2023 Tanuku Town PS	Disposable by Bindover	**U/S 151 Cr.P.C** It is alleged that myself and others conducted nirasana programme at Tanuku Town Narendra Centre regarding arrest of Ex CM Sri Nara Chandra Babu Naidu
4	Not Applicable	Cr.No.193/2023 Tanuku Town PS	Disposable by Bindover	**U/S 151 Cr.P.C** It is alleged that myself and others conducted nirasana programme at Tanuku Town Narendra Centre regarding arrest of Ex CM Sri Nara Chandra Babu Naidu.
5	Not Applicable	Cr.No.37/2024 Tanuku Town PS	Under investigation	**U/S 186, 353, 143, r/w 149 IPC** It is alleged that myself and others conducted Dharna programme at Tanuku Municipal office regarding TDP flex banners removal in Tanuku Town.
6	Not Applicable	Cr.No.55/2020 Tanuku Rural PS	Disposable by Bindover	**U/S 151 Cr.P.C** It is alleged that myself and others conducted rally programme at Tanuku without following Covid-19 guidelines and violating Covid-19 rules and raised slogans against the government.
7	Not Applicable	Cr. No 57/2020 Tanuku Rural PS	Disposable by Bindover	**U/S 151 Cr.P.C** It is alleged that myself and others conducted rally programme at Tanuku without following Covid-19 guidelines and violating Covid-19 rules and raised slogans against the government.

(B) Details about cases of conviction for criminal offences

Sl. No.	Name of Court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	Maximum Punishment Imposed
	Not Applicable	Not Applicable	Not Applicable

* In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Sd/- ARIMILLI RADHA KRISHNA

సిపిఐ అభ్యర్థి బండిని గెలిపించండి

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ - నగరంలో విస్తృత ప్రచారం

ప్రచారంలో సిపిఐ, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని గూడ్స్ షెడ్ రోడ్డు, పాండురంగపేట, ప్రధాన రహదారి, మినీ బైపాస్ రోడ్డు, రామకృష్ణాపురం, పోస్టల్ కాలనీ, జ్యూట్‌మిల్లు సెంటర్, చిట్టివలస పాకలు, పవర్‌పేటతోపాటు పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురంలో మహిళలు అభ్యర్థి బండి వెంకటేశ్వరరావుకు హారతి పట్టారు. పలుచోట్ల జరిగిన ప్రచార సభల్లో డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు డబుల్ ఇంజిన్ సర్కారు వస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని చెబుతున్నారని, చంద్రబాబు హయాంలో డబుల్ ఇంజిన్ సర్కారే ఉందని, ఆ ఐదు సంవత్సరాలు ఏం అభివృద్ధి సాధించారో తెలపాలని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ప్రతి ప్రాంతం మరో మణిపూర్ చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి విభజన హామీలు నెరవేర్చలేదని, ప్రత్యేక హోదా ఇవ్వలేదని, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయలేదని, విశాఖ రైల్వే జోన్ తుంగలో తొక్కారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న టిడిపి, జనసేన ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకుందని, వైసిపి పరోక్షంగా సహకరిస్తుందని, ఈ రెండు పార్టీల్లో ఏ పార్టీకి ఓటు వేసినా బిజెపికి వేసినట్లేనని హెచ్చరించారు. రాజ్యాంగ పరిరక్షణకు, మతసామరస్యాన్ని పెంపొందించడానికి ఇండియా వేదికను బలపర్చాలని కోరారు. సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపిస్తే నగరంలో అపరిష్కృతంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల ఏర్పాటుకు, టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేయడానికి, నగరంలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ తిరిగి అధికారం చేపడితే రాజ్యాంగాన్ని రద్దుచేసి హిందుత్వ ఎజెండాని ప్రత్యేకంగా ప్రవేశపెడతారని ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి అధికారం చేపట్టడానికి మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిని ప్రజలు ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏలూరులో సిపిఐ ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను గెలిపించాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, రాజ్యాంగ రక్షణకు, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో సిపిఐ నేతలు మండల నాగేశ్వరరావు, ఉల్లికల జయకృష్ణ, కడుపు కన్నయ్య, సిపిఎం నేతలు బి.జగన్నాథం, మంచెల్ల ఇస్సాక్, బళ్ల కనకదుర్గారావు, గేదెల నాగేశ్వరరావు, ఉప్పులూరి లక్ష్మి, గొర్లి స్వాతి పాల్గొన్నారు.

యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

సార్వత్రిక ఎన్నికల విధుల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం సిఐ పి.రాజేష్ అన్నారు. బుధవారం కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ విధుల్లో ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఇప్పటికే కామవరపుకోట చెక్‌పోస్టులో వాహన తనిఖీల్లో 25 కేసులు నమోదు కావడం సిబ్బంది పనితీరుకు నిదర్శనమన్నారు. తనిఖీ రిజిస్టర్‌ను పరిశీలించారు.

పథకాలన్నీ అమలు కావాలి: కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

సంక్షేమ పథకాలు అమలు కావాల్సిన అవసరం ఉందని, ఈ పథకాలను ఆపడానికి చంద్రబాబు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎపిలో సంక్షేమ పథకాలకు నగదు విడుదలను ఎన్నికల సంఘం నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పున పరిశీలన చేయాలని కోరారు. పవన్‌కళ్యాణ్‌ను ఓడించడానికి చంద్రబాబు, లోకేష్ కుట్ర పన్నుతున్నారని, ఇప్పటికే మహాసేన రాజేష్ వంటి వాళ్లు పవన్‌కళ్యాణ్‌ను ఓడించాలని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో చంద్రబాబు ఓటమికి దగ్గరలో ఉన్నారని, వైసిపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గుబ్బల తమ్మయ్య, మంగిన సూర్య, పొట్ల సురేష్ పాల్గొన్నారు.

రాధా రంగ మిత్రమండలి ప్రచారం

ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం రాష్ట్రమంతటా పర్యటించి ప్రచారం నిర్వహిస్తున్నట్లు రాధా-రంగా మిత్రమండలి అధ్యక్షులు, వైసిపి నేత వంగవీటి నరేంద్ర అన్నారు. వంగవీటి కుటుంబం రాజశేఖరరెడ్డి నుంచి ఇప్పటి వరకు మద్దతుగానే ఉంటుందన్నారు. ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీలన్నీ చేతల్లోనే చూపించారన్నారు.

బాలుర వసతిగృహాన్ని సందర్శించిన రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ బుధవారం స్థానిక శనివారపుపేటలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వసతిగృహంలోని వసతులను పరిశీలించారు. సౌకర్యాలపైన బాలురను అడిగి తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరంలో పరీక్షల్లో ఉత్తీర్ణులై అధిక మార్కులు పొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, క్రమశిక్షణతో ఉన్నత విద్య అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐపిఎస్‌లు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాకు వచ్చిన 9 మంది ట్రైనీ ఐపిఎస్‌లు బుధవారం కలెక్టరేట్లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన చర్యలను వివరించారు. ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఎన్నికల్లో ఓటర్లను ఏ విధంగా ప్రలోభాలకు గురిచేస్తారు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీమ్‌ల పనితీరు, ఎన్నికల ప్రచారానికి అనుమతుల మంజూరు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలు, అంశాల గురించి వివరించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ట్రైనీ ఐపిఎస్‌ల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.

కలెక్టర్‌తో ట్రైనీ ఐపిఎస్‌లు

జంతువుల పట్ల బాధ్యత వహించాలి

వేసవిలో నీటి కుండల ఏర్పాటు అభినందనీయం - పశ్చిమ కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

వేసవిలో జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి కుండల ఏర్పాటు అభినందనీయమని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ప్రతిఒక్కరూ జంతువుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బుధవారం జెపి రోడ్డులోని అష్టలక్ష్మి ఆలయంలో అంతర్జాతీయ జంతు ప్రేమికులు, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో వీధి జంతువులకు 30 నీటి బిందెలను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ మానవులుగా మనమే వేడిని భరించలేకపోతున్నామని, జంతువులను రక్షించడం మన బాధ్యత అని, జంతు సంక్షేమం కోసం ప్రతిఒక్కరూ ఆలోచనతో ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాత దేగల భవాని శీతల్, ఇంటర్నేషనల్ అలయన్స్ మాజీ ప్రెసిడెంట్ వివిఎస్.శర్మ, వై.గోపినాథ్, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు పాశం సుభద్రదేవి, అల్లు వనజాక్షి, ఝాన్సీ, ఎం.అమ్ములు, మైథిలి, జి.రమ్య, ఎస్.నాగలక్ష్మి, సుంకర దాసు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం

ఏలూరు సిటీ: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని, ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ సిబ్బంది జీన్‌హెన్రీ డ్యూనాంట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ జెండాను ఎగురవేశారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ గౌరవార్థం ఆయన పుట్టినరోజును ప్రతి సంవత్సరం ప్రపంచ రెడ్ క్రాస్‌దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఆ రోజున ప్రపంచవ్యాప్తంగా ఉన్న రెడ్‌క్రాస్ శాఖలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సిబ్బంది రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాతా శిశు విభాగం వద్ద భోజనాలను పంపిణీ చేశారు. తలసేమియా చిన్నారులకు, పత్తేబాద్‌లోని మదర్ థెరిస్సా సేవాసంఘం వద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల బాధ్యత సర్పంచులు తీసుకోవాలి: వ్యకాస

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పనుల కల్పనకు గ్రామ సర్పంచులు కూడా బాధ్యత తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. అప్పారావుపేటలోని గొల్లగూడెం కూడలిలో సంఘం నాయకులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ మే నెల రెండో వారం వచ్చినా ఇంకా ఉపాధి పనులు కల్పనలో చాలా గ్రామాల్లో జాప్యం కన్పిస్తోందన్నారు. చెరువులు పాటదారుల చేతుల్లో ఉండటం వల్ల ఇంకా పనులు ప్రారంభించడం కుదరడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పడం దారుణమని విమర్శించారు. తక్షణమే పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం తగదు

పశ్చిమ ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి - ఉండి

సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లలో ఎటువంటి నిర్లక్ష్యమూ వహించరాదని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల అన్నారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతమైన ఎన్ఆర్‌పి.అగ్రహారం పోలింగ్ బూత్‌ను ఆమె బుధవారం పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పోలింగ్ సమయంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

మాక్ పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఉండి

మాక్ పోలింగును పిఒలు, ఎపిఒలు సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, సెక్టోరల్ అధికారులకు మాక్‌పోల్, పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాటా్లడుతూ మాక్‌పోల్ నిబంధనలు వివరించారు. ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అవసరమైన అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు.

గూడెం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా డి.మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన డాక్టర్ శామ్యూల్ భీమవరం కలెక్టరేటుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మురళీకృష్ణ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమితులయ్యారు.

కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వండి

ఏలూరు ఎంపీ అభ్యర్థి లావణ్య

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం రావాలంటే ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య అన్నారు. మంగళవారం దెందులూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో విస్తరించి ఉన్న గ్రామాల్లోని ప్రజల జీవనోపాధి మెరుగుపర్చేలా కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాపై తొలి సంతకం పెడతామని, రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, ఏడాదికి ప్రతి మహిళకు రూ.లక్ష ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, సిపిఎం, సిపిఐ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సినీనటుడు వెంకటేష్ ప్రచారం

కలిదిండి: కైకలూరు బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తరుపున సినీనటుడు విక్టరీ వెంకటేష్ నిశ్శబ్ద ప్రచారం నిర్వహించారు. కలిదిండి ప్రధాన సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీ పడమటిపాలెం దాటి పరసావానిపాలెం గ్రామానికి రాగానే వైసిపి శ్రేణులు ఎదురవ్వడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ పరిస్థితిని చక్కదిద్దారు. సినీ నటుడు వెంకటేష్ ఆద్యంతం తన స్టైల్లో చేయి ఊపుతూ, అక్కడక్కడ నమస్కరిస్తూ వెళ్లడమే తప్ప ఎక్కడా మాట్లాడలేదు. సానారుద్రవరం, కోరుకొల్లు మీదుగా కైకలూరు వరకూ ర్యాలీ సాగింది.

రూ.2 లక్షలు నగదు స్వాధీనం

కామవరపుకోట: కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా బుధవారం ఒక వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలూ లేని రెండు లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మొహిద్దీన్ తెలిపారు. వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి కారులో ఈ నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తనిఖీల్లో కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యారావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున పాల్గొన్నారు.